బ్రాహ్మణ యువతకు ఉచిత విద్య

కాచిగూడ, మే 17: గ్రేటర్ హైదరాబాద్‌లోని పేద బ్రాహ్మణ బాలికలకు ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యా కోర్సుల్లో ఉచిత విద్యతో పాటు హాస్టల్ సదుపాయం కల్పిస్తున్నట్లు గ్లోబల్ బ్రాహ్మిన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గిరి ప్రసాద్ శర్మ తెలిపారు. కాచిగూడలో శనివారం ఆయన మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో వెనుకబడ్డ బ్రాహ్మణ కుటుంబాలు విద్యా రంగంలో రాణించడానికి ఈ అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. బర్కత్‌పురలోని తులసీవనం బ్రాహ్మణ బాలికల వసతి గృహం, కాచిగూడలోని వశిష్ట బ్రాహ్మణ వసతి గృహంలో ఈ ఉచిత విద్య సదుపాయం కల్పించినట్లు ఆయన తెలిపారు. వివరాలకు 97016 09689 లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

28న అగ్రి సైంటిస్ట్ అసోసియేషన్ ఎన్నికలు

వ్యవసాయ యూనివర్సిటీ, మే 17: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం అగ్రికల్చర్ సైంటిస్ట్ అసోసియేషన్ (టాసా)కు సంబంధించి ఈనెల 28న ఎన్నికలు జరగనున్నాయని వర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. ఈమేరకు ఆయన శనివారం ఎన్నికల నోటిఫికేషన్ జారీచేశారు. వర్సిటీకి చెందిన 447 మంది శాస్త్రవేత్తలు, అధ్యాపకులు మూడు ప్యానల్‌లుగా విడిపోయి నామినేషన్లు దాఖలు చేశారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌తో పాటు పాలెం, వరంగల్, జగిత్యాల్, అశ్వరావుపేట, సంగారెడ్డి, సైఫాబాద్, రుద్రూర్‌లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. 30 ఫలితాలు వెలువడే అవకాశం ఉంది. పోటీలో మూడు ఫ్యాన్స్ టాసాకు జరుగుతున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో డాక్టర్ కే పవన్ చంద్రా రెడ్డి ప్రెసిడెంట్‌గా పోటీ చేస్తుండగా, ఆ ప్యానెల్‌లో ప్రత్యక్షంగా డాక్టర్ కమలాకర్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ సల్లా సౌజన్య, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ పీ రమేష్, కోశాధికారిగా డాక్టర్ జే రాజేందర్ పోటీలో ఉన్నారు. డాక్టర్ రాజేశ్వర్ నాయక్ అధ్యక్షుడిగా పోటీచేస్తున్న ప్యానల్‌లో ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఎస్ నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ కే భానురేఖ, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ ఎం శంకర్, కోశాధికారిగా డాక్టర్ ప్రశాంత్ పోటీలో ఉన్నారు. డాక్టర్ పీ రజినీకాంత్ అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న ప్యానల్‌లో ఉపాధ్యక్షురాలుగా డాక్టర్ రమ్య, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ బీవీ వరప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ లక్ష్మీ ప్రసన్న, కోశాధికారిగా డాక్టర్ ఎండీ అలీబాబా పోటీలో ఉన్నారు.

విద్యార్థినులకు ఉచిత శిక్షణ

మేడ్చల్, మే 17: ఇంజినీరింగ్‌లో చేరనున్న విద్యార్థినులు గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో వేసవిలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఎంపీసీ పూర్తి చేసి, ఎంసెట్‌లో 50వేల లోపు ర్యాంకు సాధించి,ఇంటర్ 900 మార్కులు.. ఆపైన పొందిన విద్యార్థినులు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. జూన్ 2 నుంచి జూన్ 7 వరకు 30గంటల పాటు రెండు సెషన్స్‌లో ఇంజినీరింగ్‌కు సంబంధించిన కృత్రిమ మేధ(ఏఐ), వెబ్ అభివృద్ధి, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఆసక్తిగల విద్యార్థినులు ఈనెల 25లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు అకాడమిక్స్ డీన్ డాక్టర్ సీవీపీఆర్ ప్రసాద్‌ను 73862 00587 ఫోనంబర్‌లో సంప్రదించాలన్నారు.

'మీసేవ' అసోసియేషన్ ఎన్నిక

శామీర్‌పేట, మే 17: రాష్ట్ర మీసేవ ఆపరేటర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. శామీర్‌పేటలోని బృందావన్ రిసార్ట్‌లో వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేంద్రరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో.. అసోసియేషన్ అధ్యక్షుడిగా బత్తుల జీవన్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కొత్త కిరణ్ కుమార్, కోశాధికారిగా గొట్టిపర్తి శ్రీకాంత్ తదితర సభ్యులను ఎన్నుకున్నారు. వారితో రాఘవేంద్ర రావు ప్రమాణ స్వీకారం చేయించి.. నియామక పత్రాలను అందజేశారు.

కూలగొట్టి మళ్లీ నిర్మాణం..

కేశవరం గ్రామానికి చెందిన చెన్నూరు లింగం ఉన్న ఊరిలోనే క్షౌర వృత్తి నిర్వహిస్తున్నాడు. కష్టపడి, అప్పులు చేసి.. తన ముగ్గురు కుమార్తెల పెళ్లిళ్లు చేశాడు. ఆయన భార్య చెన్నూరి లింగమ్మకు ఇటీవల ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో శిథిలావస్థకు చేరుకున్న పెంకుటిల్లును కూలగొట్టాడు. ఆయన నిర్మిస్తున్న ఇంటి వెనుక భాగంలో మెట్ల కోసం కొద్దిగా ముందుకు జరిగి నిర్మాణం చేపట్టాడు. దీంతో విస్తీర్ణం 625 చదరపు అడుగులకు పెరిగింది. అధికారులు కొలిచి.. బిల్లు రాదని నిర్ధారించారు. దీంతో ఆయన భయపడి వేసిన పిల్లర్లు, ప్లింత్‌బీమ్‌లను కూల్చివేశాడు. లోపలికి జరిగి తిరిగి గుంతలను తీశాడు. మళ్లీ గుంతలు, పిల్లర్లు, ప్లింత్ బీమ్‌ల నిర్మాణం చేపట్టేందుకు అదనంగా దాదాపు రూ.80వేలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. తమది నిరుపేద కుటుంబం అని.. రెండు సార్ల పని చేసుండంటే కష్టం కదా' అని లబ్ధిదారురాలు లింగమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.

పిల్లర్లు కూలగొట్టుమంటున్నారు..

'మొదట మీటింగ్ పెట్టినప్పుడు మీరెంతెన్న కట్టుకోండి రూ.5లక్షలు మాత్రమే వస్తాయన్నారు. మాకు జాగా పెద్దగా ఉంది, నలుగురు ఆడపిల్లలు, ఒక కొడుకు.. ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో పెద్ద పెంకుటిల్లు కూలగొట్టి ఇల్లు కట్టుకోవాలని అనుకున్నాం. మంచిరోజు ఉందని సొకోట్ పెట్టుకున్నాం. ఇప్పుడు సొకోట్ తీసి, ఆరు పిల్లర్లకు మార్చాలని, మూడు పిల్లర్లను కూలగొట్టాలని అంటున్నారు. అప్పుడే పైసలు వస్తయంట. అట్ల కూలగొడితే మేం మళ్లీ కట్టుకోగలమా. నాకు నలుగురు బిడ్డలు, అల్లుళ్లు, మనువరాళ్ల కలిసి వస్తే రెండు రూంలు సరిపోతయా. గిట్ల అయితది అనుకుంటే మాకు ఉన్న పెంకుటిల్లు కూలగొట్టేటోళ్లమే కాదు' అని లబ్ధిదారులు పార్వతమ్మ కన్నీటి పర్యంతమయ్యారు. ఇలా చేస్తే తామెప్పుడు సొంత ఇండ్లు నిర్మించుకోగలుగుతామని.. తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఇందిరమ్మకు నిబంధనలు

- నిర్మాణం పూర్తిచేసుకున్న ఇళ్లకూ మంజూరుకాని బిల్లులు
- విస్తీర్ణం, పిల్లర్లు అంటూ సవాలక్ష కొర్రీలు
- పైలెట్ గ్రామం కేశవరంలో వింత పరిస్థితి
- అదనపు పిల్లర్లు కూలిస్తేనే బిల్లులిస్తామంటున్న అధికారులు
- నిబంధనల్లో స్పష్టత కరువు
- దిక్కుతోచని స్థితిలో లబ్ధిదారులు

అధికారుల కొర్రీలతో కేశవరంలో అర్ధంతరంగా నిలిచిపోయిన పార్వతమ్మ ఇల్లు

మేడ్చల్/శామీర్‌పేట, మే 17: 'కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయింది' అన్న చందంగా మారింది ఇందిరమ్మ లబ్ధిదారుల పరిస్థితి. నిబంధనలు డబ్బుల మంజూరుకు అడ్డంకిగా మారాయి. అధికారులు అవగాహన కల్పించడంలో లోపమో, లబ్ధిదారులకు తెలియక జరగడమో కానీ ఇంటి నిర్మాణ విస్తీర్ణంలో వచ్చిన తేడాలు మొదటికే మోసం తెచ్చిపెట్టాయి. కోటి ఆశలతో, ఉన్న ఇంటిని కూల గొట్టుకుంటే...కొత్త ఇంటికి బిల్లు రాకపోవడంతో లబ్ధిదారులు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇదీ పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలం కేశవరం గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పరిస్థితి.

101 మంజూరు... 32 ప్రారంభం

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన మూడుచింతపల్లి మండలం కేశవరం గ్రామానికి 101 ఇండ్లు మంజూరయ్యాయి. అధికారులు పలు దఫాలుగా లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి.. ఇళ్ల నిర్మాణంపై సూచనలు చేశారు. ఇప్పటివరకు 32 నిర్మాణాలు ప్రారంభం కాగా మొదటి విడతగా నలుగురికి మాత్రమే రూ.లక్ష డబ్బులు మంజూరయ్యాయి. మరో ఇద్దరికి త్వరలో మంజూరవుతాయని అధికారులు చెబుతున్నారు. అయితే 32 ఇండ్లలో ఏడింటికి వివిధ కారణాలతో బిల్లులు మంజూరు కాని పరిస్థితి.

కొరవడిన స్పష్టత..

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై ఆది నుంచే స్పష్టత కొరవడింది. అధికారులు మొదట మీకు ఉన్న స్థలంలో ఎంత విస్తీర్ణంలోనైనా కట్టుకోవచ్చు. కానీ ఇచ్చేది మాత్రం రూ.5లక్షలు అని చెప్పారని లబ్ధిదారులు చెబుతున్నారు. అంతేగానీ ఇంత విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం జరిగితేనే డబ్బులు వస్తాయని ఎక్కడా చెప్పలేదని చెప్పారు. ఈ క్రమంలో మొదట 9 పిల్లర్లతో 400 చదరపు అడుగులకు తక్కువ కాకుండా నిర్మించాలని అధికారులు తెలిపారు. ఆ తర్వాత క్రమక్రమంగా విస్తీర్ణం పెరుగుతూ వచ్చింది. 400 నుంచి 450, ఆ తర్వాత 500 ఎస్ఎఫ్‌టీకి పెరిగి, చివరకు 600 ఎస్ఎఫ్‌టీకి స్థిరపడింది. ఇప్పుడు ప్రభుత్వం 600 ఎస్ఎఫ్‌టీ కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం జరిగితే డబ్బులు రావని తేల్చి చెబుతున్నారు.

ఇంత అన్యాయమా..?

కేశవరం గ్రామంలో 32 ఇండ్ల నిర్మాణం ప్రారంభమైతే నాలుగింటికి మొదటి విడత రూ.లక్ష బిల్లులు వచ్చాయి. ఏడింటికి మొదటి విడత బిల్లు మంజూరుకు అవసరమైన మేరకు నిర్మాణం జరిగినా బిల్లు రాని పరిస్థితి ఏర్పడింది. తమకు స్థలం ఉంది కదా అని ఇద్దరు లబ్ధిదారులు కొంత విస్తీర్ణం పెంచుకొని.. అదనంగా అయ్యే డబ్బులను తామే భరించుకుందామని భావించారు. మిగితా వారు మెట్లకు సరిపోలేదని, మేస్త్రీ ఒక అడుగు జరిగి కట్టడం వల్ల 600 ఎస్ఎఫ్‌టీ కంటే విస్తీర్ణం ఎక్కువై బిల్లులు రాని పరిస్థితి. ప్రతీ స్టేజీలో ఇంటి నిర్మాణాన్ని హౌజింగ్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఆన్‌లైన్‌లో నిబంధనల మేరకు నిర్మాణం జరిగితే బిల్లు మంజూరవుతుంది, లేదంటే అనర్హతగా గుర్తిస్తారు. ఇద్దరి లబ్ధిదారులు నిర్మాణం 750 ఎస్ఎఫ్‌టీకి పైనే జరుగగా మిగితా వారివి మాత్రం 612 నుంచి మొదలు కుంటే 625 ఎస్ఎఫ్‌టీ విస్తీర్ణంలో జరిగాయి. ఈ కొద్ది విస్తీర్ణం పెరుగుదలకే బిల్లులు ఇవ్వకపోవడమేమటని.. తాము ఉన్న ఇల్లును కూలగొట్టి ఇంటి నిర్మాణం చేపడితే ప్రభుత్వం ఇంత అన్యాయంగా వ్యవహరించడం ఏమిటని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు పాటిస్తేనే బిల్లులు

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నిబంధనలు పాటిస్తేనే బిల్లులు వస్తాయి. నిర్మాణ విస్తీర్ణం 400 ఎస్ఎఫ్‌టీ కంటే ఎక్కువ 600 ఎస్ఎఫ్‌టీలోపు ఇండ్ల నిర్మాణం జరిగితే డబ్బులు వస్తాయి. 612 నుంచి 625 ఎస్ఎఫ్‌టీ వరకు జరిగిన ఇండ్ల నిర్మాణ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన కూడా బిల్లులు ఇవ్వాలంటూ సిఫార్సు చేశారు. కానీ ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరు కావడం లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే మేము వ్యవహరిస్తున్నాం. ముగ్గు పోసేటప్పుడు ఉన్న కొలతలు నిర్మాణం జరిగేటప్పుడు ఉండటం లేదు. నిబంధనల్లో ఏమైనా మార్పు వస్తే గానీ ఏమి చేయలేం. అప్పటి వరకు 601 విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం జరిగినా డబ్బులు మంజూరు కావు. లబ్ధిదారులు నిబంధనల ప్రకారమే ఇండ్లు నిర్మించుకోవాలి. – అల్లాజీ, హౌజింగ్ ఏఈ, మూడుచింతపల్లి మండలం

కాలేజీ ఎదుట రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న విద్యార్థులు

రోడ్డెక్కిన నిజాం కాలేజీ విద్యార్థులు

సెమిస్టర్ పరీక్షల హాల్‌టికెట్లు ఇవ్వడం లేదంటూ ఆందోళన

జియాగూడ, మే 17: బషీర్‌బాగ్‌లోని నిజాం కాలేజీ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. తమ జీవితాలతో కాలేజీ ప్రిన్సిపాల్ చెలగాటం ఆడుతున్నారని శనివారం కాలేజీ ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఎగ్జామ్స్ ఫీజు కట్టించుకొని ఇప్పుడు 75 శాతం అటెండెన్స్ లేదని హాల్ టికెట్స్ ఇవ్వడం లేదని డిగ్రీ సెకండ్, థర్డ్ ఇయర్‌కు చెందిన 350 మంది విద్యార్థులు ధర్నాకు దిగారు. ప్రిన్సిపాల్ రూమ్‌కు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. శనివారం జరిగే 6వ సెమిస్టర్ ఎగ్జామ్‌ను బహిష్కరించి తోటి విద్యార్థులు, అందరికి హాల్‌టికెట్స్ ఇస్తేనే ఎగ్జామ్ రాస్తామంటూ రోడ్డుపై బైఠాయించారు. ఓ విద్యార్థి మాట్లాడుతూ.. పరీక్షకు వారం ముందు హాల్ టికెట్ ఇవ్వాలి.. కానీ ఒకరోజు ముందు శక్రవారం (16వ తేదీ) ఉదయం 11 గంటలకు హాల్ టికెట్లు అందజేశారని అన్నారు. మొత్తం 560 మంది విద్యార్థులలో 350 మంది విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. ప్రిన్సిపాల్‌ను అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. హాల్ టికెట్లు ఇవ్వకుంటే సెమిస్టర్ బైకాట్ చేసి ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. చివరకు పోలీసుల జ్యోకంతో విద్యార్థులు శాంతించారు.

హైదరాబాద్‌లో టయోటా హిలక్స్ బూట్ క్యాంప్

సిటీబ్యూరో, మే17 (నమస్తే తెలంగాణ): టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) ఆధ్వర్యంలో హర్ష టయోటా, మోడీ టయోటా, ఫార్చ్యూన్ టయోటా డీలర్లతో కలిసి "హిలక్స్ బూట్ క్యాంప్" కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. మే 17, 18 తేదీలలో ప్రెసిషన్ ఆఫ్‌టెరా వెంచర్‌లో నిర్వహిస్తున్న రెండు రోజుల అడ్వెంచర్ ఈవెంట్‌లో పాల్గొనేవారికి టయోటా హిలక్స్ 4x4 వాహనాన్ని రఫ్ టెర్రైన్‌లో నడిపే అనుభూతిని కలిగించారు. ఈ కార్యక్రమంలో టీకేఎం మరియు డీలర్‌లకు చెందిన టీకేఎం సౌత్ జీఎం మహారాజ్ ముఖర్జీ, టీకేఎం తెలంగాణ హెడ్ అజిత్ కుమార్, టీకేఎం ఎఫ్ఎస్ఎం అతుల్ సింగ్, టీకేఎం ఎఫ్ఎస్ఎం వినాయక్ భోసే, హర్ష టయోటా సేల్స్ అండ్ మార్కెటింగ్ వీపీ ప్రశాంత్ పాములపర్తి, ఫార్చ్యూన్ టయోటా సేల్స్ వీపీ రమణ కుసుమ్, మోడీ టయోటా సీఈవో రంగాచార్యులు పాల్గొన్నారు.

ఏఐతో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

మల్లారెడ్డి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డా.వీఎస్‌కే రెడ్డి

సిటీబ్యూరో, మే17, (నమస్తే తెలంగాణ): వేగంగా మారుతున్న సాంకేతిక యుగంలో కృత్రిమ మేధస్సు విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు దారి చూపుతోంది. ఈ మార్పుల దిశగా ముందడుగు వేసిన మల్లారెడ్డి యూనివర్సిటీ విద్యా పద్ధతుల్లో ఏఐని సమర్థవంతంగా సమన్వయం చేస్తోంది. ప్రత్యేకంగా డిజైన్ చేసిన ఏఐ ఆధారిత వర్చువల్ ట్యూటర్లు విద్యార్థులకు అనేక విధాలుగా ఉపయోగపడుతున్నాయి. సందేహాల నివృత్తి, పునరావృత పరీక్షలు, వ్యక్తిగత శైలికి అనుగుణంగా కంటెంట్ సిఫారసులు చేయడం వంటి సేవలు అందిస్తున్నాయి. ఈ విధానం వలన విద్యార్థులు తమ సొంత స్థాయిలో అభివృద్ధి చెందుతున్నారు. అధ్యాపకులకు ఏఐ శిక్షణ ఇచ్చి, పాఠ్య ప్రణాళికలు, పనితీరు విశ్లేషణ, కంటెంట్ డెలివరీ వంటి రంగాల్లో ఆధునికీకరణ జరుగుతోంది. అంతేకాక, గ్లోబల్ టెక్ లీడర్లతో కలిసి పరిశోధన వేదికలను ఏర్పాటు చేయాలని యూనివర్సిటీ సంకల్పించింది. ఈ సందర్భంగా మల్లారెడ్డి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డా.వీఎస్‌కే రెడ్డి మాట్లాడుతూ.. ఏఐ భవిష్యత్ కల ఇప్పటికే సాకారమైంది. దాని ద్వారా లోతైన నేర్పు, విద్యా సమానత్వం, ఉద్యోగ నైపుణ్యాలతో కూడిన బోధనకు దారి తీయనుంది. భవిష్యత్తును ఆవిష్కరించడంలో ఎంఆర్‌యూ కీలక పాత్ర పోషిస్తోంది. మన దేశ ఇంజినీరింగ్ విద్యా వ్యవస్థ ఏఐని ఒక పాఠ్యాంశంగా కాకుండా బోధనా విధానంగా కూడా స్వీకరించాలి అని వీఎస్‌కే రెడ్డి సూచించారు. ఏఐతో భవిష్యత్‌లో మెరుగైన ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు.

పనితీరు మెరుగుపరుచుకోవాలి

బల్దియా ఉన్నతాధికారుల సమీక్షలో మంత్రి పొన్నం

సిటీ బ్యూరో, మే 17 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ అధికారులు పనితీరు మెరుగుపరుచుకోవాలని, ప్రతి సమస్యను సమయోచితంగా పరిష్కరించేలా వ్యవస్థలు ఏర్పాటు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇంజినీరింగ్, శానిటేషన్, స్ట్రీట్ లైటింగ్, వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై ఆయన ఉన్నతాధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యలపై జీహెచ్ఎంసీ పోర్టల్ లేదా మొబైల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో డ్రైనేజీ సమస్యలపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్న ప్రాంతాల్లో ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణాలను వేగవంతం చేయాలని.. అవసరమైన అన్ని సహాయసహకారాలు అందిస్తామని వెల్లడించారు. అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు.

గద్దర్ ఫిలిం అవార్డులను అడ్డుకుంటాం

తెలంగాణ సినిమా వేదిక

మాట్లాడుతున్న ప్రపుల్ రామ్‌రెడ్డి

చిక్కడపల్లి, మే 17: గద్దర్ ఫిలిం అవార్డులను తెలంగాణ సినిమాలకు ఇవ్వకపోతే అడ్డుకుంటారని తెలంగాణ సినిమా వేదిక (టీసీవీ) రాష్ట్ర కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. చిక్కడపల్లిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీసీవీ, తెలంగాణ సినిమా రాష్ట్ర సలహాదారుడు ప్రపుల్ రామ్‌రెడ్డి, కన్వీనర్ లారా, రాష్ట్ర కోకన్వీనర్ మోహన్ బైరాగి మాట్లాడారు. తెలంగాణ స్వరాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాలవుతున్నా మన సినిమా రంగంపై ఆంధ్ర సినిమా పెద్దల ఆధిపత్యం కొనసాగుతోందని విమర్శించారు. పేరుకే తెలంగాణ ఫిలిం ఛాంబర్ అన్నారు. ఫిలిం అవార్డులు ఆంధ్ర ఫిలిం ఛాంబర్‌లో నిర్వహించడం సిగ్గుచేటని విమర్శించారు. తెలంగాణలో చిన్న సినిమాలకు థియేటర్లు దొరకడం లేదని, థియేటర్ల మాఫియా కొనసాగుతోందని ఆరోపించారు. తెలంగాణ సినిమా రంగం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను పరిష్కరించాలని, గద్దర్ అవార్డులను తెలంగాణ సినిమాకు మాత్రమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రేవి సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో డంప్ చేస్తే క్రిమినల్ కేసులు

సిటీబ్యూరో, మే 17 (నమస్తే తెలంగాణ): చెరువులో మట్టి, నిర్మాణ వ్యర్థాలు పోసేవారిపై క్రిమినల్ కేసులు పెడతామని ట్రాన్స్‌పోర్టర్లు, బిల్డర్లను హైడ్రా హెచ్చరించింది. రియల్ ఎస్టేట్ సంస్థలు, బిల్డర్లు, ట్రాన్స్‌పోర్ట్‌లతో పాటు ఆయా సంఘాల ప్రతినిధులతో హైడ్రా కమిషనర్ రంనాథ్ శనివారం హైడ్రా కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ వారికి పలు సూచనలు చేశారు. నగర ప్రజలు.. చెరువుల్లో మట్టి పోసి నింపుతున్న వారి సమాచారాన్ని ప్రత్యేకంగా కేటాయించిన 90001 13667 నంబర్‌కు ఫోన్‌చేసి తెలపాలని రంగనాథ్ కోరారు. చెరువులో మట్టి పోస్తున్న లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు, మట్టిని సర్దుతున్న జేసీబీల వీడియోలు పంపాలని, హైడ్రా ట్విట్టర్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని రంగనాథ్ తెలిపారు.

అత్యాధునిక ఫీచర్స్‌తో కియా కారెన్స్ క్లావిస్

మలక్‌పేటలోని కియా షోరూమ్‌లో కియా సిరీస్‌లో కొత్త మోడల్ కారెన్స్ క్లావిస్‌ను శనివారం సినీ నటి పాయల్ రాజ్‌పుత్ లాంచ్ చేశారు. మూడు వరుసల సీట్లను కలిగిన ఈ కార్‌లో అత్యాధునిక ఫీచర్స్ ఉన్నాయని యాజమాన్యం తెలిపింది. బోల్డ్ డిజైన్‌తోపాటు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ, సేఫ్టీ, ఫ్యూచర్ ఫార్వర్డ్‌గా తయారు చేశారని వెల్లడించారు. ఈ న్యూ ఏజ్ ప్రీమియం రీక్రియేషనల్ వాహనాలు తమ షోరూమ్‌లో అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.

– సిటీ బ్యూరో, మే 17 (నమస్తే తెలంగాణ):

కిమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్స

అతిపెద్ద కణితిని తొలగించిన వైద్యులు



శస్త్రచికిత్స అనంతరం రోగితో కిమ్స్ వైద్యులు

మాదాపూర్, మే 17: ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ మహిళకు కొండాపూర్ కిమ్స్ దవాఖాన వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేసి కాపాడారు. మియాపూర్‌కు చెందిన 35 ఏళ్ల మహిళకు గొంతు వద్ద థైరాయిడ్ వాపు కారణంగా.. గుండెను, ఊపిరితిత్తులను, ప్రధాన రక్తనాళాలను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తుండటంతో ఇబ్బంది పడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉండగా.. ఆమెకు కిమ్స్ వైద్యులు చికిత్స చేసి నయం చేశారు. ఈ సందర్భంగా థోరాసిక్ సర్జన్, డాక్టర్ సీ రోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. 35 ఏళ్ల వయసున్న ఆ మహిళ ఊపిరి అందక ఇబ్బంది పడుతూ ముందుగా వేరే దవాఖానకు వెళ్లగా అక్కడ పరీక్షలు జరిపిన వైద్యులు ఎదలో కుడివైపుపై భాగంలో ఒక భారీ కణితి కనిపించింది. బయాప్సీ పరీక్షలో భారీ థైరాయిడ్ కణంలా అనిపించడంతో ఆమెను కొండాపూర్‌లోని కిమ్స్ దవాఖానాకు పంపించారు. దీంతో అక్కడ పరీక్షలు చేసిన వైద్యులు ఆమెకు చాలా కాలం నుంచి థైరాయిడ్ వాపు సమస్య ఉందని, క్రమంగా మెడ నుంచి కిందికి వెళ్లి ఎదభాగాన్ని ఆక్రమించిందని తెలిసింది. ఆమె కుడివైపు ఊపిరితిత్తులు, గుండె, ప్రధాన రక్తనాళం.. ఇవన్నీ క్రమంగా వ్యాపిస్తూ రెట్రోస్టెర్నల్ గాయిటర్‌గా రూపొందింది. పెద్ద శస్త్ర చికిత్స చేయాలని చెప్పగా దాదాపు 15 సెంటీమీటర్ల పొడవున్న కణితి, కుడివైపు పై ఊపిరితిత్తిని, గుండెను, ఒక ప్రధాన నరాన్ని బాగా నొక్కి పట్టినట్లు గుర్తించాము. అత్యంత చాకచక్యంగా వ్యవహరించి, నైపుణ్యంతో ఆ కణితిని జాగ్రత్తగా తొలగించాం. దీంతో ఆమెకు రక్తప్రసరణ మొత్తం సాధారణ స్థితికి చేరుకుంది. శస్త్ర చికిత్స అనంతరం ఆమె కోలుకోవడంతో వారం రోజుల తర్వాత డిశ్చార్జ్ చేసినట్లు డాక్టర్ రోహన్ రెడ్డి తెలిపారు. శస్త్రచికిత్సలో ఇంకా ఎండోక్రైన్ సర్జన్ డాక్టర్ రమ్య వలివేరు, గుండె నిపుణులు డాక్టర్ నిసర్గ, డాక్టర్ వినీత్, వ్యాస్కులర్ సర్జన్ డాక్టర్ వెంకటేశ్ బొల్లినేని తదితరులు భాగమయ్యారు.

కేర్‌లో అల్ట్రాసౌండ్ నైపుణ్యాలపై శిక్షణ

సిటీబ్యూరో, మే17 (నమస్తే తెలంగాణ): అత్యవసర పరిస్థితుల్లో వేగంగా వ్యాధిని గుర్తించేందుకు ఉపయోగపడే అల్ట్రాసౌండ్ నైపుణ్యాలను వైద్యులకు అందించేందుకు కేర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఇండియాతో కలిసి శనివారం జాతీయ అల్ట్రాసౌండ్ లైఫ్ సపోర్ట్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో ట్రామా, కార్డియాక్ అరెస్ట్, షాక్ వంటి అత్యవసర పరిస్థితుల్లో పేషెంట్లను త్వరగా అంచనా వేసేందుకు అవసరమైన అల్ట్రాసౌండ్ సాంకేతికతలపై శిక్షణనిచ్చారు. అల్ట్రాసౌండ్ నేడు అత్యవసర వైద్యంలో ప్రధాన పరికరంగా మారిందని.. దీన్ని రోజూవారీ ప్రాక్టీస్‌లోకి తీసుకురావడమే తమ ఉద్దేశంగా భావిస్తున్నట్లు కేర్ హాస్పిటల్స్ అసోసియేట్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్ కుమార్‌వర్మ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సెమీ అకడమిక్ చెయిర్ డాక్టర్ శ్రీనత్ కుమార్ టీఎస్ మాట్లాడుతూ.."జాతీయ అల్ట్రాసౌండ్ లైఫ్ సపోర్ట్ శిక్షణ కేవలం ఒక కోర్సే కాదు, ఇది దేశ ఆరోగ్య రంగానికి అవసరమైన కార్యక్రమం. గోల్డెన్